క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు మిరప, పత్తి విత్తనాలను ఎంఆర్‌పీకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆగ్రోస్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో ఏడీఏ, ఏఓలు తనిఖీ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు జూన్ మాసంలో పత్తి సాగుచేసుకుంటే మంచిదని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన షాప్‌లో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అలాగే ఆర్బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ మహేశ్వరరెడ్డి వెంట ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ

గోనెగండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సమగ్రశిక్ష గరల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీత సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు, బోధించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీలో 40 సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు.ఎస్‌ఓ విద్యావతి, సీఆర్పీలు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నందవరం: సచివాలయాల ద్వారా ప్రభుత్వం ఆధార్ సేవలను అందిస్తోందని, ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. ఈ నెల 18, 19, 20, 26, 27వ తేదీన నందవరం ఎంపీపీ స్కూల్‌ల్లో, అలాగే నాగలదిన్నెలోని జెడ్పీహెచ్ స్కూల్, 26, 27వ తేదీల్లో ఎంపీయూపీ స్కూల్‌లో ఆధార్ సేవలు అందిస్తునట్లు వెల్లడించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి, హెచ్.కైరవాడి గ్రామాల్లో సోమవారం హంద్రీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. హెచ్.కైరవాడికి చెందిన సుధాకర్, గంజిహళ్లికి చెందిన హనుమంతు ఆయా గ్రామాల్లో హంద్రీ నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సోమవారం ఉదయం ట్రాక్టర్లల్లో ఇసుకను లోడ్ చేసుకొని తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మంచి నీటి ట్యాంకర్ ఏర్పాటు

తుగ్గలి: మండల పరిధిలోని దేశాయ తండాలో తాగునీటి సమస్య తలెత్తడంతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆదేశాల మేరకు మంచి నీటి ట్యాంకరును ఏర్పాటు చేశారు. సోమవారం వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప ట్యాంకరును ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, రఘు, పక్కీరప్ప, తేరప్ప, రామంజి పాల్గొన్నారు. ట్యాంకరు ఏర్పాటు చేయడం పట్ల వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, స్విస్ బ్యాంక్‌లో ఉన్న నల్లధనాన్ని వెలికితీయడంలోనూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ, సీపీఎం నాయకులు రంగన్న, రాముడు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆయా పార్టీల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారభేరి పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఎస్టీ పేరుతో ప్రజలపై కేంద్ర ప్రభుత్వం పెను భారం మోపిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలరాజు, మల్లికార్జున గౌడ్, నరసింహులు, ఖాజా, దాదావలి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్‌కు నిప్పు

హొళగుంద: మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో సోమవారం వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో నిప్పంటుకుని గడ్డి మొత్తం పూర్తిగా కాలి బూడిదైంది. గ్రామానికి చెందిన రైతు కురువ నాగరాజు తన పొలంలోని వరిగడ్డిని ట్రాక్టర్‌లో తీసుకొస్తుండగా గ్రామంలోని కన్నడ పాఠశాల వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు గడ్డికి తగిలి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే తేరుకున్న ట్రాక్టర్ డ్రైవర్ ట్రాలీ లిఫ్ట్‌ను ఎత్తడంతో కాలుతున్న గడ్డి కింద పడింది. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పి వేశారు. ట్రాక్టర్ ట్రాలీ పాక్షికంగా దెబ్బతినగా వరి గడ్డి పూర్తిగా కాలిపోయి రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు కురువ నాగరాజు వాపోయాడు.

ఆహా.. అతిమధురం

- తమిళనాడు, రాజస్తాన్ నుంచి వచ్చి స్వీట్ల తయారీలో రాణిస్తున్న కార్మికులు
- 20 ఏళ్లుగా మిఠాయిల వ్యాపారమే వృత్తి
- పెండ్లిళ్లు, ఫంక్షన్లకు ప్రత్యేక ఆర్డర్లు



పాల పానకం తయారీ చేస్తున్న తమిళనాడు స్వీట్ల వ్యాపారి



స్వీట్లను విక్రయానికి ఉంచిన దృశ్యం

ఆలూరు: నోరూరించే మిఠాయిలు వారికి జీవనాధారమయ్యాయి. తమిళనాడు, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి పొట్టచేతబట్టుకుని వలస వచ్చిన వారికి మిఠాయిల తయారీ వృత్తిగా మారింది. దాదాపు 20 ఏళ్లుగా పలు రకాల స్వీట్లు తయారు చేస్తూ ప్రజల నోరు తీపి చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడి ఈ ప్రాంతవాసులకు కొత్త రుచులు చూపిస్తున్నారు. నియోజకవర్గకేంద్రమైన ఆలూరులోని కర్నూలు, బళ్లారి, ఎల్లార్తి రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారులు వివిధ రకాల స్వీట్లను విక్రయిస్తున్నారు. అలాగే పలు గ్రామాలకు పసందైన స్వీట్లు సప్లయ్ చేస్తున్నారు. పలు శుభ కార్యక్రమాలకు ఆర్డర్లు తీసుకుని ప్రత్యేకంగా తయారుచేసిన మిఠాయిలను అందిస్తూ ఆదాయం పొందుతున్నారు. వీరిలో పలువురు బేకరీలను కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో అధికంగా పొడి లడ్డు, జాంగ్రీ, పాలకొవ్వ, బ్రెడ్, తిరుపతి లడ్డూ, కార, బూందీ, మిక్చర్, మైసూర్‌పాక్, గులాబ్‌జామ్, బర్త్‌డే కేకులు, ఎగ్ పఫ్, వెజ్ పఫ్, పకోడి, చెకోడీలు ఇలా అనేక రకాల స్వీట్లు, కారాను వీరు తయారు చేస్తారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం నుంచి ఇక్కడికి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, శుభ, అశుభ కార్యక్రమాలకు ఇక్కడ జాంగ్రీ, మిక్చర్ వడ్డించడం అనవాయితీగా కొనసాగుతోంది.

నాణ్యమైన పదార్థాలతో ప్రత్యేక రుచి

నాణ్యమైన శనగపిండి, మంచి నూనె, ఉద్ది బేడలు, చెక్కెర, కార్న్‌పౌడర్, యాలుకులు, నెయ్యి, శొంఠి, గోడంబి, పాలు, ఎండుద్రాక్ష, వెల్లుల్లిపాయలు, జీలకర్ర, కొన్నింటిలో బెల్లం, వంటి నాణ్యమైన ఉత్పత్తులను మిఠాయిల తయారీలో వినియోగిస్తున్నారు. నాణ్యతో పాటు శుచి, శుభ్రత చూడగానే నోరూరించే వెరైటీలు, మరచిపోలేనంత మధురంగా మిఠాయిలు తయారు చేయడం ద్వారా గత 20 ఏళ్లుగా ఈ వ్యాపారంలో రాణిస్తున్నారు.

ఆకర్షణీయంగా మిఠాయిలు

ఇక్కడి కార్మికులు తయారుచేసిన రంగురంగుల మిఠాయిలను చూడగానే ప్రతిఒక్కరికీ నోరూరిస్తూ వెంటనే తినాలనిపిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా సంకోచం లేకుండా తినేలా షుగర్‌ఫ్రీ స్వీట్లు కూడా ఇక్కడి వ్యాపారస్తులు తయారు చేసి అందుబాటులో ఉంచుతున్నారు. ఆలూరు మీదుగా మంత్రాలయంలో కొలువుదీరిన రాఘవేంద్ర స్వామి, ఆదోని పట్టణ కేంద్రంలో లక్ష్మమ్మవ్వ, గట్టు మల్లయ్య దర్శనానికి వెళ్లే భక్తుల తాడికి ఎక్కువగా ఉండడంతో ఆయా మార్గాల్లో రోడ్డు పక్కన గాజు గ్లాస్‌తో తాయార్ చేసిన బండ్లపై మిఠాయిలను ఉంచి విక్రయిస్తున్నారు. రాజాస్తాన్ వారు తయారు చేసిన స్వీట్లకు బోలేవార్ మిఠాయిలుగాను, తమిళనాడు వ్యాపారస్తులు తయారుచేసిన వాటిని మురగన్ స్వీట్లుగా నామకరణం చేసి విక్రయిస్తున్నారు.

రుచి, శుచి ఉంటేనే కొంటారు

నాణ్యమైన శనగ పిండి, చెక్కెర, నూనెలతో పాటు అన్ని వస్తువులు సమపాళ్లలో వాడితేనే మిఠాయిలకు మంచి రుచి వస్తుంది. మిఠాయిలు రుచికరంగా లేకపోతే కొనడం మానేస్తారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో మిఠాయిలు తయారు చేసేందుకు ఖర్చు కూడా పెరుగుతుంది. నేను తమిళనాడు నుంచి వచ్చి గత పదేళ్లుగా ఇదే వ్యాపారం చేస్తున్నా. పెండ్లిళ్ల సీజన్‌లో చేతినిండా పని మంచి ఆదాయం వస్తుంది.

– సుబ్రమణ్యమణి, మిఠాయిల వ్యాపారి

నాణ్యత లోపిస్తే చర్యలు

పట్టణ కేంద్రంలో మిఠాయిల నాణ్యతపై కొన్నిసార్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుంటాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులతో నాణ్యతను పరిశీలించి చర్యలు చేపడతాం. మిఠాయిల తయారీలో నాణ్యతతో పటు శుభ్రత పాటించాలని వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశాం.

– బి.కృష్ణకుమార్, ఆలూరు ఈఓ

పన్ను మినహాయింపు ఇవ్వాలి

మద్దికెర: ప్రభుత్వ స్థలాలలో బంకులు ఏర్పాటు చేసు కొని వ్యాపారాలు చేసుకుంటున్న వారు పన్ను చెల్లించాలని, సొంత స్థలాలలో వ్యాపారం చేసుకునేవారు చెల్లించాల్సిన అవసరం లేదని ఈఓ శ్రీహరి అన్నారు. గ్రామంలోని నాయీ బ్రాహ్మణులు సోమవారం స్థాని క పంచాయతీ కార్యాలయంలో ఈఓను కలిసి పన్నుల నుంచి మినహాయించాలని కోరారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ గదులు బాడుగకు తీసుకొని కులవృత్తి చేసుకుంటున్న వారు,సొంత స్థలాలలోబంకులు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్న వారికి మినహాయింపు ఇస్తామని, మిగతా వారు పన్ను చెల్లించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కొరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కామర్స్,పొలిటికల్ సైన్స్,ఆర్గానిక్ ఫార్మింగ్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.ఆయా సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను జతపరచి ఈ నెల 30వతేదీలోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటు

హొళగుంద: పౌరుల ఆధార్ అప్‌డేట్, ఇతర పనులకో సం మండలంలో రెండు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ దాసానాయక్ సోమవారం తెలిపా రు.స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఒకటి, చిన్నహ్యా ట గ్రామ సచివాలయంలో మరొకటి కొనసాగుతున్నట్లు ఆయన వెల్లడించారు. మొదటి విడత కింద ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు, రెండవ విడత కింద ఈ నెల 26, 27 తేదీల్లో ఆధార్ కేంద్రాల్లో సేవలందించనున్నట్లు తెలిపారు.

జిల్లా అధికారులను కలిసిన ఎమ్మెల్యే



జిల్లా కలెక్టర్ సృజనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం కర్నూలులో జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే వారిని మర్యాదపూర్వకంగా కలసి, పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి, శాంతి భద్రతల పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని జిల్లా అధికారులను ఎమ్మెల్యే కోరారు.

మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డికి నివాళి

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి మృతదేహాన్ని పత్తికొండ ఎమెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో సందర్శించి నివాళులర్పించారు. నీరజారెడ్డి బంధువులు, కుటుంబసభ్యులతో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



మంటలార్పే విధానంపై డెమో ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: అగ్నిప్రమాదాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ రామాంజినేయులు సూచించారు. సోమవారం పట్టణంలోని గుడ్‌బేస్ పాఠశాల, తిరుమల నగర్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను అదుపులోకి తేవడం, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన అంశాలపై అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ విపత్తు సమయాల్లో తీసుకోవలసిన సహాయక చర్యలను వివరించారు.

ఆలూరు రూరల్: విద్యార్థులు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలని ఆలూరు విపత్తుల, అగ్నిమాపక అధికారి ఖాద్రి సూచించారు. స్థానిక ప్రగతి స్కూల్ విద్యార్థులకు సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలపై డెమో చేసి చూపించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 101కు కాల్ చేయాలని సూచించారు. సిబ్బంది రాజారాం, రాజారమేష్, ఉదయ్, ఇబ్రహీం, బాషా, ఉన్నారు.

పత్తికొండటౌన్: స్థానిక ఆదోని రోడ్డులోని అయ్యప్ప కాంప్లెక్స్ వద్ద అగ్నిమాపక కేంద్రం అధికారి ఎ.దినకర్‌బాబు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై డెమో నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. గ్యాస్ లీకై అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించి మంటలు ఎలా ఆర్పాలో వివరించారు. లీడింగ్ ఫైర్‌మెన్ మరూఫ్, సిబ్బంది రమేష్, షబ్బీర్, హుస్సేన్, వీరాంజి, రాజు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా



ఆలూరు సింగిల్ విండో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన హనుమంతమ్మను సత్కరిస్తున్న దృశ్యం

ఆలూరు: స్థానిక సహకార సంఘం పరిధిలోని రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తున్న రుణాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, బర్రె, గొర్రెలు, పంపిణీ చేసి ఆర్థికంగా ఎదిగేందుకు తన వంతుగా కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సింగిల్ విండో చైర్‌పర్సన్ హనుమంతమ్మ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సీఈఓ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతమ్మ మాట్లాడుతూ.. సంఘం పరిధిలో సభ్యత్వం ఉన్న రైతులకు తన వంతుగా చేయూత అందిస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఎంపీటీసీలు జీరానాగమ్మ, బోయ యల్లమ్మ, మోతి యల్లమ్మ, సర్పంచ్ దేవిరెడ్డి, వైస్ ఎంపీపీ నాగవేణి, సింగిల్ విండో డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నగరి మారెప్ప, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్యాంకు, సింగిల్ విండో కార్యాలయ సిబ్బంది తదితరులు చైర్‌పర్సన్ హనుమంతమ్మను సన్మానించారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్యం



ఆలూరులోని సచివాలయం-3 పరిధిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మారుతి

ఆలూరు రూరల్: గ్రామీణ ప్రాంత రోగులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా 104 వాహనాలతో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్లు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. సోమవారం ఆలూరులోని సచివాలయం-3 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు షుగర్, బీపీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్త్ క్యాంపులో 62 మందికి వైద్య పరీక్షలు చేశారు.

ఇంటింటికీ వైద్య సేవలు

నందవరం: మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నా మని పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత అన్నారు. సోమవారం మండలంలోని జగ్గాపురం, జొహరాపురం, నదికైరవాడి గ్రామాల్లో బాలింతలు, గర్భిణులకు ఇంటి వద్దకే వచ్చి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగా హెల్త్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లుని పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు శాంతమ్మ, లక్ష్మీబాయి, ఇస్మాయిల్, ఏఎన్‌ఎంలు జయరత్నమ్మ, పుష్పావతి పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు జనాదరణ



కటారుకొండలో కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు సైతం మళ్లీ సీఎంగా జగనన్నే రావాలని కోరుకుంటున్నారని సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్, బాలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కటారుకొండ, అమకతాడు తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. నాయకులు లక్ష్మన్న, మదనగోపాల్, మాధవకృష్ణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని డి.కోటకొండ, హలిగేర, చిన్నహోతూరు గ్రామాలలో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు జయలక్ష్మి, బసవరాజు, నాయుడు, రంగన్న, దస్తగిరమ్మ, ఉసేని తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి సర్వే నిర్వహించారు. డి.కోటకొండలో రైతు ఉరుకుందప్ప స్వయంగా జగనన్న స్టిక్కర్ ఇప్పించుకుని ఇంటి గోడకు అతికించుకున్నారు. సొసైటీ సీఈఓ అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని వైఎస్సార్‌సీపీ నాయకులు కులుమాల శ్రీనివాసులు, మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం గోనెగండ్లతో పాటు కులుమాల, పెద్దమరివీడు, గంజిహళ్లి, అలువాల, పెద్దనేలటూర్, తిప్పనూరు తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ జగనన్న స్టిక్కర్లను అతికించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాలను వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికు మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాబకాష్, నాయుడు, డాక్టర్ శివరాం, ఉస్మాన్, నరసన్న ఆచారి, నాగేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

24న కల్యాణోత్సవం

తుగ్గలి: ఈనెల 24వ తేదీన చెన్నంపల్లిలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు సోమవారం గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివార్ల కల్యాణం, సాయంత్ర రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాల సందర్భంగా 25న గిరక బండి పోటీలు ఉంటాయని వెల్లడించారు.

పదే పదే తప్పులు చేయొద్దు

హొళగుంద: వలంటీర్లు పదే పదే తప్పులు చేయొద్దని, ప్రజలకు సకాలంలో సేవలందించడంలో, ప్రభుత్వ పథకాలపై సర్వే, ఇతర విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ దాసానాయక్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పనితీరు సరిగా లేని 30 మంది వలంటీర్లకు ఇప్పటికే మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదని, అలాంటి వారి జీతాలు నిలిపివేయడం లేదా విధుల నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. తమకు కెటాయించిన కుటుంబాలకు వలంటీర్లు అందుబాటులో ఉండి బాధ్యతగా సేవలందించాలన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పత్తికొండటౌన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణయ్య, తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంఠయ్య, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండలో ఏఐటీయూసీ నాయకులు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ర్యాలీగా వచ్చి స్థానిక నాలుగు స్తంభాల మండపం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, ఏఐటీయూసీ నాయకులు మాదన్న, గుండుభాష, రాజప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

భూసార పరీక్ష పంటకు రక్ష

వెల్దుర్తి: రైతులు భూసార పరీక్ష చేయించుకుని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి ఫలితం ఉంటుందని ఏఓ అక్బర్‌బాషా అన్నారు. మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఆయన సిబ్బంది, ఎంపీఈఓలకు భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో మట్టి నమునాలను సేకరించి వాటిని పరీక్షించి ఫలితాలకు రైతులకు తెలియజేయాలని సూచించారు. ఏఈఓ విలసీత, ఆర్‌బీకేల సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

'స్పందన'తో సత్వర పరిష్కారం



స్పందన కార్యక్రమానికి హాజరైన మండలాధికారులు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్పందన' కార్యక్రమంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సృజన నిర్వహించిన స్పందన కార్యక్రమానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరయ్యారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి స్పందన ఒక వేదికగా ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. స్పందన అర్జీలకు త్వరగా న్యాయం చేకూరుతుందన్నారు. నందవరంలోని ఆయా కాలనీవాసులు నీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడుకు అర్జీ అందజేశారు. నాగలదిన్నె గ్రామ రైతులు కనకవీడు గ్రామంలోని తమ పొలంను సర్వే చేసి హద్దులు చూపించాలని తహసీల్దార్‌కు అర్జీలను అందించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎంఈఓ సుదర్శన్ రెడ్డి, పీఆర్‌ఏఈ జయన్న, విద్యుత్ శాఖ ఏఈ రవీంద్ర, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, వివిధ శాఖల మండలాధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



హులేబీడు గ్రామ పొలాల్లో వీఏఏలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆలూరు ఏడీఏ సునీత సూచించారు. సోమవారం ఆలూరు మండల వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు వాడుతున్న రసాయన ఎరువులు, పురుగు మందుల వల్ల నేల స్వభావం మారుతుందన్నారు. భూమిలో ఉన్న పోషక పదార్థాలే గాకుండా చౌడు శాతం ఎంత ఉందో నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు భూసార పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. అన్ని ఆర్బీకేల పరిధిలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. రైతు పొలం నుంచి మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్ పంపించాలన్నారు. ఏఓ వెంకటేష్ గౌడ్, టెక్నికల్ ఏఓ రాజేష్ అగ్రికర్చర్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

లోకేష్ అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం



మద్దికెరలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ రాజకీయ అజ్ఞాని అని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జిట్టా నాగేష్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మారెల్ల రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. యువగళం పాదయాత్ర సభలో నారా లోకేష్ మహిళా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై చేసిన ఆరోపణలపై వారు వేర్వేరుగా స్పందించారు. లోకేష్ వ్యాఖ్యలను బట్టి మహిళల పట్ల ఆయనకున్న గౌరవం ఏంటో తెలుస్తోందన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టులు చదవడం తప్ప వాస్తవాలు తెలుసుకోలేని దద్దమ్మ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఎమ్మెల్యేపై నోరుజారితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

యువగళం యాత్ర కాదది.. తిట్ల యాత్ర

మద్దికెర: నారా లోకేష్ చేస్తున్నది యువగళం పాదయాత్ర కాదని తిట్ల దండకం యాత్ర అని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, మల్లికార్జున, భద్రయ్య అన్నారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హాలులో వారు మాట్లాడుతూ.. పత్తికొండ ఎమ్మెల్యే మహిళ అని చూడకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, మహిళలకు మీరిచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చింది చదవుతూ తిట్ల దండకం యాత్ర సాగిస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. హామీలు లేని పాదయాత్ర ఎందుకని, ప్రజలకు ఏం చేస్తారో చేబితే బాగుంటుందని హితవు పలికారు. నాయకులు గంపల వెంకటేశులు, లక్ష్మన్న, నాయకులు కిట్టి, రామాంజులు, కృష్ణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హామీలు లేని పాదయాత్ర ఎందుకు?

చిప్పగిరి: హామీలు లేని లోకేష్ పాదయాత్ర ఎందుకని ఎంపీపీ జూటూరు హేమలత ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజల అభ్యున్నతికి ఏమి చేస్తారో చెప్పకుండా పస లేని యాత్ర చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి వర్గానికి లబ్ధి చేకూర్చారని చెప్పారు. లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసినా పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.